క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కైత్లాపూర్, రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దార్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

విరాళాలు ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు



దాతలను సన్మానిస్తున్న కమిటీ అధ్యక్షుడు జై లక్ష్మణ్‌గుప్తా

మోతీనగర్: శ్రీరామ నవమి పురస్కరించుకొని నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమానికి విరాళాలు అందించిన దాతలకు గాయత్రినగర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జై లక్ష్మణ్‌గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం దాతలకు కల్యాణోత్సవ తలంబ్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి, శ్రీరామనవమి, బతుకమ్మ, బోనాలు వంటి అనేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గాయత్రి సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ గోదా కృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బస్తీ కమిటీ సభ్యులు, అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీలోకి బొల్ల రూప



బీజేపీ కండువా కప్పి రూపను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవరం కాంతారావు

మోతీనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన బీజేపీ పార్టీలో చేరుతున్నారని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. శుక్రవారం సామాజిక కార్యకర్త బొల్ల రూప బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. నిజమైన కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రావణ్, సాదిఖ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగాజాబ్ మేళా

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్ మేళా కూకట్‌పల్లి జంక్షన్‌లోని మెట్రోక్యాష్‌అండ్ క్యారీ వెనుక గ్రౌండ్‌లో 2వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నం. 63017 17425, 63017 16125.

మే 30న ఢిల్లీలో ధర్నా



ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజా సమస్యలు, దళితులపై దాడులు తదితరాలను నిరసిస్తూ మే 30న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ప్రథమ మహాసభ జరిగింది. కార్యక్రమానికి డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు యేసురత్నం అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రాంమూర్తి, బాల మల్లేష్ తదితరులు ప్రసంగించారు. మే 30న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు, రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రమాదాలకు నిలయంగా చౌరస్తాలు



ఆంజనేయనగర్ చౌరస్తాలో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు



రంగనాథస్వామి ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డులో వేగంగా వెళ్తున్న వాహనాలు

మూసాపేట: మూసాపేట, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలోని చౌరస్తాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవటం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవటం, స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అయోమయంలో వాహనదారులు

◆ ఆంజనేయనగర్ చౌరస్తాలో ప్రమాదకరంగా ఉంది. ముఖ్యంగా కైత్లాపూర్ నుంచి వచ్చే వాహనాలు పూర్తి పల్లపు ప్రాంతం కావటంతో వేగంగా వస్తుంటాయి. ఆ వాహనాలు ఆంజనేయనగర్ వైపు వెళుతున్నాయా లేక మున్సిపల్ కార్యాలయం వైపు వెళుతున్నాయో అర్థం కాని పరిస్థితి. దీంతో ఆంజనేయనగర్ నుంచి కైత్లాపూర్ నుంచి వెళ్లే వాహనాలు, మున్సిపల్ ఆఫీస్ నుంచి వచ్చే వాహనాలు ఎటు వెళుతున్నాయో తెలియక ఆందోళనగా వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

సిగ్నల్ ఏర్పాటు చేసినా అందుబాటులోకి రాలేదు..

◆ నాలుగు వైపుల నుంచి వస్తున్న వాహనాలు ఎటువైపు వెళుతున్నాయో కూడా ఎదురుగా వచ్చే వాహనదారునికి అర్థం కాదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో కొన్ని నెలల క్రితమే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా వాటిని ఇప్పటికి అందుబాటులోకి తీసుకురాలేదు. అంతేకాకుండా కనీసం స్పీడ్ బ్రేకర్స్ కూడా ఏర్పాటు చేయటం లేదు. ఈ ప్రాంతంలో సిగ్నల్స్‌ను త్వరగా ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

స్పీడ్ బ్రేకర్లను తొలగించారు..

◆ రెయిన్‌బో విస్టాస్ వద్ద గతంలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేశారు. ఇటీవల కొత్తగా రోడ్డు వేయటంతో స్పీడ్ బ్రేకర్స్ తొలగించారు. తిరిగి స్పీడ్ బ్రేకర్‌ను నిర్మించలేదు. ఈ ప్రాంతంలో ఉదయం సమయంలో పాఠశాలకు పంపించే విద్యార్థులతో పాటు వారిని పంపించే తల్లిదండ్రుల వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. హైటెక్ సిటీకి, అయ్యప్ప సొసైటీకి వెళ్లేందుకు ఇదే మార్గం కావటం.. తక్కువ దూరం కావటంతో ఎక్కువ మంది ఇక్కడి నుంచే వెళ్తుంటారు. అంతేకాకుండా ఈ రహదారి డబుల్ రోడ్డు కావటంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి.

రోడ్డు దాటేందుకు ఇబ్బందులు..

◆ ఐడియల్ చెరువు కట్ట నుంచి వేగంగా వచ్చిన వాహనాలకు రంగనాయక స్వామి టెంపుల్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు కనిపించక ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇక్కడ సూచిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేసినా కానీ వాహనాల వేగాన్ని నిరోధించలేకపోతున్నారు. దీంతో రోడ్డు దాటేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

చౌరస్తాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి..

◆ కైత్లాపూర్ రోడ్డుకు వెళ్లాలంటే ఎడమ వైపు టర్న్ తీసుకోవాలి. ఇక్కడ జీబ్రా క్రాసింగ్ లైన్లు లేకపోవటంతో వాహనాలు అదే స్పీడ్‌గా ఎడమకు మళ్లటంతో కైత్లాపూర్ నుంచి వచ్చే వాహనదారులు వేగాన్ని నియంత్రించుకోలేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అదే విధంగా కైత్లాపూర్ నుంచి వచ్చే వాహనాలు ఐడియల్ చెరువుకు వెళ్లేందుకు మలుపు తీసుకునేటప్పుడు అదే వేగంతో ఉంటే ఐడియల్ చెరువు నుంచి యూటర్న్ తీసుకునే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విధంగా ఈ రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ చౌరస్తాలను పరిశీలించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

'మదర్‌హుడ్ అండ్ బియాండ్ జర్నీ' సభ్యత్వం షురూ



లోటస్ ఆస్పత్రిలో సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీజీపీ శిఖాగోయల్, సిబ్బంది

కూకట్‌పల్లి: దక్షిణ భారతదేశంలో స్త్రీలు, పిల్లలకు అత్యంత అందుబాటు ధరల్లో వైద్య సేవలను అందించే సుప్రసిద్ధ ఆస్పత్రుల్లో లోటస్ ఆస్పత్రి ఒకటి అని నిర్వాహకులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్, కూకట్‌పల్లితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. రోగులకు మెరుగైన వద్య సేవలను అందించడానికి క్లినికల్ మేనేజ్‌మెంట్‌తో సమగ్రమైన చికిత్సా విధానం అనుసరిస్తోంది. ప్రముఖ పీడియాట్రిషియనల్లో ఒకరైన డాక్టర్ వీఎస్‌వీ ప్రసాద్ 2006లో తొలి యూనిట్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించి నవజాత శిశువులు, వారి తల్లులు, యుక్త వయసు పిల్లలకు వైద్య చికిత్సలు అందజేస్తున్నారన్నారు.

◆ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని లోటస్ ఆసుపత్రిలో నెల రోజులపాటు విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు స్ఫూర్తి కలిగేలా ఈ కార్యక్రమాలు ఉండటంతో పాటు అన్ని వయసుల మహిళల్లో ఆరోగ్యవంతమైన జీవనశైలి అనుసరించేందుకు తోడ్పడిందని తెలిపారు. అందులో భాగంగా సెంటర్‌ఫర్ ఎక్సలెన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు.

◆ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, మహిళా భద్రత, షీటీమ్స్, భరోసా డైరెక్టర్, ఐపీఎస్ శిఖాగోయల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించి కాంప్లిమెంటరీ సభ్యత్వ కార్యక్రమం 'మదర్‌హుడ్ అండ్ బియాండ్ జర్నీ'శీర్షికను విడుదల చేశారు. మెంబర్‌షిప్ కార్డుతో విభిన్నమైన ప్రయోజనాలు అందించటంలో లోటస్ హాస్పిటల్ ప్రస్తుతం ప్రతి ఒక్కరికి అందుబాటు ధరల్లో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తోందన్నారు.

◆ అందులో భాగంగా అన్ని ఆరోగ్య ప్యాకేజీలపై 40 శాతం రాయితీ అందిస్తున్నామని తెలిపారు. ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న వారికి ప్రెగ్నెన్సీ ప్యాకేజీలపై కూడా రాయితీ అందిస్తున్నామని పేర్కొన్నారు. లోటస్ ఆస్పత్రి తమ గైనకాలజికల్ యూనిట్‌ను పునఃప్రారంభించామని తెలిపారు. మాతృమూర్తులు, వారి కుటుంబ సభ్యులకు అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు.

'మనూ'ను సందర్శించిన ఐఎఫ్‌సీపీఏఆర్ డైరెక్టర్ నితిన్‌సేథ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని న్యూఢిల్లీలోని ఇండో–ఫ్రెంచ్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్(ఐఎఫ్‌సీపీఏఆర్) డైరెక్టర్ ప్రొఫెసర్ నితిన్‌సేథ్ సందర్శించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో పర్యటించి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్‌తో తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం పరిపాలన భవనంలోని సమావేశ హాల్‌లో సీనియర్ ఫ్యాకల్టీలతో సమావేశమయ్యారు.

6న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

గచ్చిబౌలి: నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్న లైట్ హౌస్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏప్రిల్ 6న ప్రారంభించనున్నారు. చందానగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఎదురుగా జీహెచ్ఎంసీ నిర్మించిన భవనంలో ఇక నుంచి శిక్షణ ఇస్తారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత, వెస్ట్ జోనల్ కమిషనర్ ఎస్.శంకరయ్య, చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుదాంష్ తదితరులు పాల్గొంటారు.

'ఓబై అరియా లైఫ్ వాటర్'తో భాగస్వామ్యం

మాదాపూర్: పర్యావరణం పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తున్నట్టు నొవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్ రుబియన్ చెరియన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని నొవాటెల్‌లో శుక్రవారం ప్రపంచంలో మొట్టమొదటి ప్యాకేజ్డ్ అట్మాస్ఫియరిక్ మినరల్ వాటర్ ఓబై అరియా లైఫ్ వాటర్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్టు తెలిపారు.

వస్తాద్ అడివయ్యకు ఘన నివాళి

రాయదుర్గం: ఖాజాగూడకు చెందిన ప్రముఖ వస్తాద్ అడివయ్యకు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన 12వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సొంతగ్రామమైన ఖాజాగూడలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నరులకు పండ్లు పంపిణీ చేయడంతోపాటు క్రీడాకారులకు క్రీడాసామాగ్రిని కూడా పంపిణీ చేయడం విశేషం.

బీఆర్ఎస్‌ను గద్దె దించే వరకు ప్రజాయాత్ర సాగుతుంది

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్
- ఆల్విన్‌కాలనీ నుంచి ప్రారంభమైన రవన్న ప్రజాయాత్ర



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో రవన్న ప్రజాయాత్ర భాగంగా సమస్యను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పన్నాల హరీష్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో గడపగడపకు బీజేపీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమయ్యింది. శుక్రవారం డివిజన్ పరిధిలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తలపెట్టిన రవన్న ప్రజాయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా పన్నాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. రవికుమార్ యాదవ్ తలపెట్టిన పాదయాత్ర రేపటి శేరిలింగంపల్లి విజయానికి నాంది పలకాలన్నారు. ఈ పాదయాత్రలో కార్యకర్తలందరూ పాల్గొని గడపగడపకు బీజేపీని తీసుకువెళ్లాలని కోరారు. కన్వీనర్ మణిభూషణ్ మాట్లాడుతూ... అందరం కలిసికట్టుగా ఒకటై అధికార పార్టీని చుట్టుముట్టాలన్నారు.

◆ ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రోజురోజుకి అధికార పార్టీ దౌర్జన్యాలు, కబ్జాలు మితిమీరిపోతున్నాయని పేర్కొన్నారు. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి రవన్న ప్రజాయాత్ర ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి బీఆర్ఎస్ ఆగడాలను వివరిస్తామని తెలిపారు. నియోజకవర్గం మొత్తం ప్రజా సమస్యలపై పాదయాత్ర చేస్తానన్నారు. అధికార పార్టీని గద్దె దించే వరకు పాదయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. అందరినీ కలుపుకుని వెళ్తూ శేరిలింగంపల్లిలో కాషాయ జెండా ఎగరవేస్తామని తెలిపారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఈ పాదయాత్ర 10 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

◆ ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు, విజిత్ వర్మ, కో–కన్వీనర్ మణిభూషణ్, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, కుమార్‌యాదవ్, నరేందర్ రెడ్డి, కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, నవతారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ రావు, భూపాల్ రెడ్డి, నవీన్ గౌడ్, రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఇంజినీరింగ్ కళాశాల సమస్యలను పరిష్కరించాలి



ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు



ప్రిన్సిపాల్ రూమ్‌లో ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు శుక్రవారం ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ప్రిన్సిపాల్ అందుబాటులో లేని కారణంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు వర్షిత్, గాదె పవన్, రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. రోజురోజుకు ఇంజినీరింగ్ కళాశాలలో సమస్యలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జయలక్ష్మి సమస్యలు తీర్చడమే కాదు వినడానికి కూడా సమయం ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఆర్‌సీలో లిఫ్ట్ పనిచేయకపోవటంతో దివ్యాంగ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్, కళాశాలలో వైఫై సౌకర్యం కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.

◆ కెమికల్ ఇంజినీరింగ్‌కు ఇంకా నూతన భవనం నిర్మించలేదని తెలిపారు. కొత్త టేబుల్స్, కుర్చీలను తెప్పిస్తామని ఆరు నెలల కిందటే హామీ ఇచ్చినా ఇంత వరకు లేవన్నారు. మెస్‌లో బాయిలర్స్ పాడయిపోయినా ఇంత వరకు బాగు చేయించలేదని తెలిపారు. దీంతో ఉడికి ఉడకని అన్నం తినాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రిన్సిపాల్‌కు సమస్యల గురించి మొరపెట్టుకుంటే హెచ్‌ఓడీకి చెప్పి బెదిరిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేయడం లేదని.. నిధులు కేటాయించకపోతే మేమేం చేయాలని బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే తరగతులను బహిష్కరించి విశ్వవిద్యాలయంలో బంద్‌కు పిలుపునిస్తామన్నారు. కళాశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శివకృష్ణ, బ్రహ్మం, ఆకాష్, రంజిత్, మంజునాథ్, సారథి, చందు, యశ్వంత్, స్నేహిత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌కు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుర్మయ్యగారి నవీన్‌కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పండాల సతీష్‌గౌడ్, సబిహా బేగం, ఆవుల రవీందర్‌రెడ్డి, దొడ్ల వెంకటేష్‌గౌడ్, ముద్దం నర్సింహయాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు బాబురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్మయ్యగారి కొండల్ రావు, దామోదర్ పటేల్, అమ్రేష్ గౌడ్, నాగరాజు, రామకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. – కూకట్‌పల్లి

వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ తెలిపారు. గచ్చిబౌలి లోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన 50 సీట్లతోకూడిన బస్సును, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పనిచేసే అధికార యంత్రాంగం, సిబ్బందితో పాటు విద్యార్థులందరికీ వీటి వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంద న్నారు.

కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని కార్పొరేటర్ రాగంనాగేందర్ యాదవ్ స్పష్టం చేశారు.శుక్రవారం ఆదర్శ నగర్, నెహ్రూనగర్, గోపీనగర్‌లలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లను పరిశీలించారు. దశలవారీగా డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



ప్రపంచ తాగునీటి దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ నుంచి జనప్రియ కచేరి వరకు వాటర్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు ప్రపంచ నీటి దినోత్సవంపై శుక్రవారం తాగునీటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొని మాట్లాడారు. వర్షపునీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తాగునీటితో వాహనాలు కడగొద్దన్నారు. మంచి నీటిని రోడ్లపైకి వృథాగా వదలవద్దని సూచించారు. ప్రతి సంవత్సరం తాగునీటి పొదుపుపై అవగాహన కలిస్తూ ప్రపంచ నీటి దినోత్సవాన్ని పాటిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు తాగునీటి సమస్యను తీర్చలేకపోయాయని అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలందరికి తాగునీటిని అందిస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్ మూర్తి, వెంగలయ్య, మాధవరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, మహిళా అధ్యక్షులు పార్వతమ్మ, బాబా, జగన్, శ్రీనివాసరెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రసాద్, చాంద్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలలపై కుక్కల దాడి

సుభాష్‌నగర్: కిరాణా కొట్టుకు వెళ్తున్న బాలికపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గాజులరామారం డివిజన్ మల్లారెడ్డినగర్‌లోని చెన్నకేశవనగర్‌కు చెందిన శ్రీధర్ రెడ్డి కుమార్తె అన్విత (8). గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న కిరాణా కొట్టులో పాల ప్యాకెట్ కోసం వెళ్తుండగా అక్కడే ఉన్న వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచింది. దీంతో అన్వితను షాపూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి చేర్పించారు.

సూరారంలో...

సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీలోని ఇంటి పెంపుడు కుక్క దాడి చేసి ఓ వ్యక్తిని గాయపరిచింది. సూరారం కాలనీకి చెందిన ప్రేమ్ (15) ఇంట్లో పని చేస్తుండగా ఉదయం పెంపుడు కుక్క ఒక్కసారిగా అరుస్తూ కరిచింది.

పదవీ విరమణ

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (ఎల్‌జీఎస్)గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన బాబమ్మను ఘనంగా సత్కరించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో విధులను నిర్వహించిన ఆమెను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సత్కరించారు. ఈ సందర్భంగా క్రెడిట్ సొసైటీ ఫండ్ కింద రూ.30వేల చెక్‌ను బాబమ్మకు అందించారు. అలాగే పొదుపు మొత్తం రూ.2.60 లక్షలు తన బ్యాంక్ ఖాతాలో జమచేశామన్నారు.